## క్లుప్తంగా

### నేడు బూరుగులమ్మ తిరునాళ్ల



**రేపల్లె రూరల్:** మాఘ పౌర్ణమి పురస్కరించుకుని ఓల్డ్ టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీబూరుగులమ్మ తిరునాళ్ల, 12వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 24, 25వ తేదీల్లో నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ ఆవరణలో బారిగేట్లు ఏర్పాటు చేశారు. కొబ్బరికాయలు కొట్టేందుకు, ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. 24న శనివారం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అఖండదీప స్థాపన, పంచామృత, ఫలరసాలతో అభిషేకం, సద్ది నైవేద్యం సమర్పణ, గ్రామోత్సవం, 25న ఆదివారం సహస్ర కుంకుమార్చన, సద్ది నైవేద్యం సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురుకులు తెలిపారు. అభిషేక మహోత్సవంలో పాల్గొనే భక్తులు స్వయంగా అమ్మవారికి పంచామృతాలు, పండ్లరసాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

### కనుల పండువగా సీతారాముల గ్రామోత్సవం



**అద్దేపల్లి(భట్టిప్రోలు):** అద్దేపల్లిలో నూతనంగా నిర్మించిన సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠా కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రతిష్ఠా మూర్తులైన స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీ నిధులు రూ. 10 లక్షలు, దాతల విరాళాలతో ఈ దేవాలయ పునః నిర్మాణం జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రాతఃకాల పూజ, జప, పారాయణాలు, ఆవాహిక దేవతా హోమాలు, గణపతి, రుద్ర, నవగ్రహ, చండి, సుదర్శన, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. రాత్రి గాలిపాలెం వెంకయ్యస్వామి పీఠాధిపతులు చిన్న వెంకయ్య స్వామి శ్రీరామనామ సంకీర్తన, ఆధ్యాత్మిక ఉపన్యాసం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను బద్వేలుకు చెందిన రామకృష్ణశాస్త్రి, నాగరాజశర్మ, శివకుమార్ శాస్త్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ప్రతిష్ఠా కార్యక్రమం, ఉదయం శ్రీ సీతారామ కల్యాణం, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు శ్రీ సీతారామాలయ కమిటీ దేవాలయ ట్రస్టీ కుందేటి శ్రీరామ కోటి నరసింహరావు తెలిపారు.

### నేడు భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవం

**భట్టిప్రోలు:** భట్టిప్రోలులోని కొతరపు వారి వీధిలో ఉన్న సీతారామ మందిరంలో శనివారం నుంచి శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పద్మశాలీయ బహుత్తమ సంఘం(అద్దేపల్లి) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రాత్రి స్వామి వార్ల కల్యాణం, ఆదివారం స్థానిక శ్రీరామ నామ క్షేత్రంలో సమారాధన జరుగుతుందని పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

**రేపల్లె రూరల్:** విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోటుమెరక, గంగడిపాలెం, లంకెవానిదిబ్బ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏడీఈ పి.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

### వంద మందికి వైద్య పరీక్షలు

**రేపల్లెరూరల్:** రెబ్బా ప్రసాద్ మెమోరియల్ హోం ఆధ్వర్యంలో రెబ్బా ప్రసాద్-లూధియమ్మల వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 18వ వార్డు జగనన్నకాలనీలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో జనరల్ సర్జన్ రెబ్బా జాన్‌ప్రసాద్, డెంటల్ వైద్యురాలు అమూల్య 100 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న కళాజాత

**గుంటూరు మెడికల్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు హ్యాపెన్ సంస్థ శుక్రవారం స్థానిక మిర్చి యార్డులో కళాజాత బృందాలతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్‌ఐవీ బాధితులతో వ్యవహరించే తీరు, హెచ్‌ఐవీ, టీబీ మధ్య ఉన్న సంబంధం గురించి కళాజాత ద్వారా వివరించారు. కార్యక్రమంలో హ్యాపెన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, మేనేజర్ జి.జయరాజు, ఏఎన్ఎం అమ్మాజీ, సురేష్ పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయం

**మార్చి 9న బాపట్లలో జాతీయ లోక్ అదాలత్**



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గుర్రం వాణి

**బాపట్లటౌన్:** కేసుల పరిష్కారమే జాతీయ లోక్ అదాలత్ ధ్యేయమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గుర్రం వాణి తెలిపారు. జిల్లా కోర్టులో శుక్రవారం న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి గుర్రం వాణి మాట్లాడుతూ మార్చి 9న బాపట్ల కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కేసుల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. తద్వారా ఎక్కువ కేసులు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. పవన్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీకాంత్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేంద్రనాథ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమాలీలాకృష్ణ, పోలీసు అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ విజయానికి విద్యార్థుల పాత్ర కీలకం

**ఏపీ ఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ రవి గుజ్జుల**



మాట్లాడుతున్న డాక్టర్ రవి గుజ్జుల

**గుంటూరు రూరల్:** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో పురోగతి సాధించుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు సులభతరమవుతాయని ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ గుజ్జుల రవి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ 2047 విజన్ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన అగ్రదేశాలకు ధీటుగా భారత దేశాన్ని ఉంచే లక్ష్యంతో రూపొందించిన కార్యక్రమం వికసిత్ భారత్ 2047 విజన్ కార్యక్రమం అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు అందిస్తున్న తోడ్పాటును వినియోగించుకోవాలని చెప్పారు. ది ఫ్యూచర్ ఈస్ నౌ షేపింగ్ ఏ డెవలప్డ్ ఇండియా త్రు ఐ టీ ఎనేబుల్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించి విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థుల నైపుణ్య అభివృద్ధిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ కార్యక్రమాల వివరాలను వివరిస్తూ భవిష్యత్తులో సాంకేతిక రంగ ప్రభావాన్ని ఆయన తెలియజేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 247 కళాశాలల్లో అతి తక్కువ సంఖ్యలో మాత్రమే మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు విద్యా బోధనా విధానం అందజేయబడుతుందని, మిగతా అధిక శాతం విద్యార్థుల్లో క్షీణిస్తున్న నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మారుమూల గ్రామీణ స్థాయి విద్యార్థుల వరకు ఫైబర్ నెట్ ద్వారా ఆన్‌లైన్ ప్రత్యక్ష విధానం ద్వారా స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ పబ్లిక్ ప్రైవేట్ సెక్టార్‌ల సంయుక్త సహకారంతో నిపుణులచే రూపొందించిన కార్యక్రమాలను అందిస్తున్నార న్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పురస్కారాన్ని తమ కళాశాల అందుకోవడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో అతిథిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎమ్‌విపి చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

### అనధికారికంగా మద్యం విక్రయిస్తే చర్యలు

**కాకుమాను:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో ఎవరైన మద్యం విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవింద్ర అన్నారు. మండలంలోని పాండ్రపాడు శివారులో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైన మద్యం విక్రయిస్తే అటువంటి వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి నుంచి ఆరు ఫుల్ బాటిల్‌ల మద్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవింద్ర తెలిపారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తుల కొంగుబంగారం తిరుపతమ్మ తల్లి

**గుంటూరు రూరల్:** భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవత శ్రీ తిరుపతమ్మ తల్లి అని పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం చల్లావారిపాలెం గ్రామం సీతమ్మ కాలనీలోగల శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయ 7వ వార్షిక కల్యాణ, వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. సమన్వయకర్త ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదం మహాన్నదానం కార్యక్రమాన్ని సమన్వయకర్త ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడి మృతి

**పట్నంబజారు:** ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ బి.కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ హుస్సేన్ (25) శుక్రవారం మధ్యాహ్నం స్నేహితులు తోట జయ ఆదిత్య, ఎన్. తరుణ్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి హుస్సేన్ నగర్‌వైపు వెళ్లారు. ఎం. కన్వెన్షన్ వద్ద డివైడర్ పక్కన నిలుచుకుని టర్నింగ్ తిప్పుకునే క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో మహబు హుస్సేన్‌కు తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. జయ ఆదిత్య, తరుణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియాల్సి ఉంది.

### భారతదేశ అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

**గుంటూరు మెడికల్:** బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలో ప్రజాపోరు ప్రారంభమైంది. తొలుత స్థానిక కొత్తపేట శివాలయంలో ఆయన పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని ప్రజలు మూడోసారి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఏపీలో అభివృద్ధికోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, చరకా కుమార్ గౌడ్, పోతురాజు వెంకటేశ్వర్లు, కామేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ జైన్, బాబూరావు, మనోజ్, అనిల్, సత్యనారాయణ, వీరేంద్రకుమార్ పాల్గొన్నారు.


## చలపతి ఫార్మసీలో సీఎల్‌పీటీ మేలోత్సవ్ 3.0



రిబ్బన్ కట్‌చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ సూర్యచంద్రరావు

**గుంటూరు రూరల్:** ప్రతి మనిషికి దైనందిన జీవితంలో ఆటలు, వ్యాయామం ఎంతో ప్రముఖ్యత కలిగిన విషయాలని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమీషన్ సెక్రటరీ ప్రొఫెసర్ డి సూర్యచంద్రరావు తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయిలో జరగనున్న సీఎల్‌పీటీ మేలోత్సవ్ 3.0 కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్ననాటినుంచి క్రీడలు, వ్యాయామానికి కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. క్రమం తప్పకుండా ఇవి రెండుపాటిస్తూ మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, తగ్గించుకుని మంచి ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.జాన్సన్ మాట్లాడుతూ క్రీడల ద్వారా జ్ఞాపకశక్తి, చురుకుదనం, ఫిజికల్ ఫిట్‌నెస్ పెరుగుతాయన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు ఆటలపై శ్రద్ధ పెరిగితే ఉత్సాహంగా విద్యలోనూ రాణిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఈ మేలోత్సవ్ కార్యక్రమం రెండు రోజులపాటు జరుగుతుందని కార్యక్రమంలో వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, క్యారమ్స్, చెస్, రన్నింగ్(1500 మీ) వంటి 13 రంగాల్లో బాల బాలికలకు విడివిడిగా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 16 కళాశాలల నుంచి విద్యార్థులు 482 మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. క్రీడాకారులకు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

**గుంటూరు రూరల్:** ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని చిప్స్ కళాశాలలో చెన్నైకి చెందిన ఒమెగా హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరుకాగా మొత్తం 145 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. వారిలో తమ కళాశాలకు చెందిన 80 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ 2.5 లక్షల వేతనం ఇస్తూ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, ట్రజరర్ ఆర్ గోపాలకృష్ణలు అభినందించారు.

## శిశువుల అపహరణను అరికట్టేందుకు పటిష్ట ప్రణాళిక



శిశుతోపాటు, తల్లికి ట్యాగ్ వేసిన దృశ్యాన్ని చూపుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

**గుంటూరు మెడికల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిశువుల అపహరణను అరికట్టేందుకు బృహత్తర ప్రణాళికను రూపొందించిందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. కాన్పుల వార్డు వద్ద శుక్రవారం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ శిశువు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాన్పుల వార్డు, ప్రసూతి వార్డులలో శిశువుల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో నిఘా కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పుట్టిన శిశువులకు, తల్లులకు ట్యాగ్ వేస్తున్నట్లు చెప్పారు. ఇద్దరూ వేరు కాకుండా మానిటరీ చేస్తూ, నిఘా ద్వారా శిశువుల అపహరించే వారిని వెంటనే గుర్తించే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్యాగ్ లను ఎవరైనా తొలగించాలని ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగి సంబంధిత సిబ్బందిని అలెర్ట్ చేస్తుందని వివరించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం 40 రీడర్లు, అలారంలను అమర్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, గైనకాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ వి.అరుణ, పి. జయంతి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని, కాలర్ మేనేజర్ కిరణ్, ఎన్. జగదీశ్ పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తి అరెస్ట్

**చేబ్రోలు:** అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తిని చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం స్థానిక జీబీసీ రహదారి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఐ పి. మహేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. జీబీ నారాయణను అదుపులోకి తీసుకొని అతని వద్ద నిల్వ చేసిన 20మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ పి మహేష్ కుమార్ తెలిపారు.

## రైతుల బాధను అర్థం చేసుకోవడంలో కేంద్రం విఫలం



**లక్ష్మీపురం:** రైతుల బాధల్ని అర్థం చేసుకోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విశ్లేషణ సభలో ఆయన మాట్లాడారు. పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని ఖానేరీ వద్ద ప్రస్తుత యుద్ధ వాతావరణం చూస్తే ప్రభుత్వ మొండి వైఖరి, నియంతృత్వ విధానాలు అర్థం మవుతున్నాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ మాట్లాడుతూ కేంద్రం ఇప్పటికైనా రైతుల ఆవేదనని అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మురళి, సదాశివం ప్రసంగించారు.

## వైభవంగా మల్లికార్జునస్వామి తిరునాళ్ల



సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌కు స్వామివారి ఆశీర్వాదం

**నిజాంపట్నం:** అడవులదీవి గ్రామంలో వేంచేసియున్న శ్రీ భ్రమరీ బాల త్రిపుర సుందరీ సమేత మల్లికార్జునేశ్వరస్వామి తిరునాళ్ల శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు తమ పశు సంపద వృద్ధి చెందాలని కోరుతూ స్వామివారి ఆలయం చుట్టూ తమ పశువులతో ప్రదక్షిణలు చేయించారు. పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో విద్యుద్దీపాలతో కూడిన ప్రభలను ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి, అమ్మవారికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, ఎంపీటీసీ మోపిదేవి హరనాథబాబు, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, సర్పంచ్‌లు శొంఠి శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ గణేష్‌కు, ఎంపీటీసీ హరనాథబాబుకు శాస్త్రోక్తంగా పట్టువస్త్రాలు అందజేశారు.

## వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య కల్యాణం



చింతాయపాలెంలో పూజలందుకున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల విగ్రహాలు.

**చింతాయపాలెం(కర్లపాలెం):** శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వాముల శాంతి కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. చింతాయపాలెం పంచాయతీ తూర్పుపాలెంలో ఆలయ ప్రాంగణంలో వేదికపై లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాముల ఉత్సవ విగ్రహాలను ఉంచి, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత శ్రీచందన సుగంధ ద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ప్రభను, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్న సంతర్పణ చేశారు.

## వలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో నేతాజీ

**కర్లపాలెం:** మండల ప్రజా పరిషత్ కర్యాలయంలో ఎంపీడీఓ నేతాజీ గ్రామ వాలంటీర్ల పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని మొత్తం 10 గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 22 వలంటీర్‌ల పోస్టులకు 28 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 25 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని చెప్పారు. గ్రామ వలంటీర్లకు ఎంపికైన వారికి ఈనెల 26న నియామక ఉత్తర్వులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

## జీవ మనుగడకు విస్తృతమైన అధ్యయనం అవసరం

**వీసీ ఆచార్య పి. రాజశేఖర్**



ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్. వేదికపై సదస్సు డైరెక్టర్ ఆచార్య మల్లికార్జున తదితరులు

**ఏఎన్‌యూ:** జీవ మనుగడకు దోహదం చేసే అంశాలపై విస్తృతమైన అధ్యయనం జరగాల్సిన ఆవశ్యకత ఉందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'నావల్ ప్రాసెసస్ అండ్ అప్లికేషన్స్ ఇన్ బయాలజీ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలోని పరిస్థితులను బట్టి లైఫ్‌సైన్స్ విద్యార్థులు, పరిశోధకులు వారి ఆలోచనల్లోని సృజనాత్మకతను పూర్తిగా ఉపయోగించేలా మానసికంగా సన్నద్ధమవ్వాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న కఠిన పరిస్థితులను నివారించేందుకు జీవశాస్త్ర విధానాలు దోహదం చేస్తాయని తెలిపారు. సైన్స్ విద్యార్థులు మానవతా విలువలు, మతసామరస్యం కలిగి హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక ప్రపంచాన్ని ఏకీకృతం చేస్తున్న సమయంలో విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం అలవర్చుకోవాలని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని మనసా వాచా ఆచరించాలని చెప్పారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ కోవిడ్ -19 తరువాత ప్రపంచ శాస్త్ర సాంకేతిక సమాజం ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, అయినప్పటికీ జీవశాస్త్రంలోని అధునాతన విధానాలతో వాటిని అధిగమించినట్లు తెలిపారు. ప్రధాన వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య రాజగోపాల్, ఆచార్య వై. శ్రీనివాసులు, డాక్టర్ ఎస్. సిద్ధార్ధ్ అధునాతన అంశాలైన ఫోటో సింథసిస్, ఎపోమిక్సీస్, మాలిక్యులర్, ఫైల్లో జెనిటిక్స్ వంటి అంశాలపై పరిశోధన సారాంశాన్ని తెలియజేశారు. యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ టి. చంద్రశేఖర్ జీవ వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ, వాటి నిర్వహణ పద్ధతులను వివరించారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా , తమిళనాడు, రాష్ట్రాల నుంచి 450 మంది విద్యార్థులు, పరిశోధకులు నుంచి శాస్త్రవేత్తలు హాజరయ్యారని డైరెక్టర్ ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు ఆచార్య ఎస్ఎం. ఖాసిం, అమృతవల్లి, మాధవి, పి. రాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంకుల సమ్మె విజయవంతం



**భట్టిప్రోలు:** దేశంలో గ్రామీణ బ్యాంకులను బలోపేతం చేసేందుకు అఖిల భారత గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల (ఏఐఆర్ఆర్ బీఈఏ) సమ్మెతో శుక్రవారం గ్రామీణ బ్యాంకులు మూతపడ్డాయి. మండలంలోని పల్లెకోన, వెల్లటూరు, భట్టిప్రోలులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ తలుపులు తెరుచుకోలేదు. ఈ సందర్భంగా సీజీజీ బ్యాంక్ స్టాఫ్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ మన్నెం సాయికృష్ణ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సమస్యల సాధనలో భాగంగా దేశ వ్యాప్తంగా సమ్మెకు చేపట్టినట్లు తెలిపారు. 22 వేల శాఖల ద్వారా 43 కోట్ల ఖాతా దారులకు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల జాతీయ గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఈ సమ్మె నిర్వహించినట్లు తెలిపారు.

## మురుగు కాల్వలను బాగు చేసేందుకు చర్యలు



**తెనాలిఅర్బన్:** పట్టణంలోని మురుగు కాల్వలను బాగు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. అలాగే మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాల్వల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు. ఆమె వెంట మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.